క్లుప్తంగా

నేడు అందుబాటులో ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు కొలుకుల రోడ్డులోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటారని, 11 గంటలకు స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన పోస్టాఫీసును ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

చలి తీవ్రతతో సమస్యలు

పుల్లలచెరువు: చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దగ్గు తదితర శ్వాసకోశ సమస్యలు పెరిగే అవకాశం ఉంటుందని, ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా వైద్యుల సూచనలు పాటించాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసింహ సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దగ్గు, చలి, శ్వాసకోశ సంబంధ వ్యాధుల లక్షణాలుంటే ప్రారంభ దశలోనే గుర్తించేలా అవగాహన కల్పించేలా సిబ్బందికి సూచనలు అందజేశామన్నారు. ప్రజలకు సత్వర చికిత్స అందచేయడంతో పాటు మెరుగైన వైద్య సేవలు సమయానికి అందజేసేందుకు అవసరమైన సామగ్రిని, మందులు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. చలి తగ్గించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రోగ లక్షణాలు కనిపించినప్పుడు సమీపంలోని వైద్యసిబ్బందిని సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ నేడు

యర్రగొండపాలెం: స్థానిక మేజర్ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై శనివారం జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టనున్నారు. పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి సాధారణ, ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేశారని, వసూలు చేసిన ఇంటి పన్నులు సకాలంలో పంచాయతీకి జమ చేయడం లేదని ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణ కోసం త్రిసభ్య కమిటీని నియమించారు.

వృథాగా పోతున్న సాగర్ నీరు



ట్యాప్ నుంచి పోతున్న సాగర్ నీరు

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని సాగర్ పైపు లైన్ ద్వారా వచ్చే నీరు వృథాగా పోవడమే తప్ప ప్రజలకు ఉపయోగపడిన దాఖలాలు లేవు. రెండు రోజులకు, మూడు రోజులకు వచ్చే సాగర్ పైపు నీరు ఎక్కడ ఎందుకు వేశారో అధికారులకు తెలియదు. నీటి పైపు లైను అంటే ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలి. పంచాయతీ వారు నీటి వృథాను అరికట్టే మరమ్మతులు చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో నందీశ్వరునికి అభిషేకం



నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న పూజారి సుబ్బారావు

కురిచేడు: కార్తీక మాస శివరాత్రి సందర్భంగా స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలోని నందీశ్వరునికి భక్తిశ్రద్ధలతో శుక్రవారం అభిషేకం చేశారు. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు భక్తులతో శాస్త్రోక్తంగా అభిషేకం చేయించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదాన ప్రభువే..
శరణం అయ్యప్ప!

- నిష్టతో ఉండే మాలధారులకు అయ్యప్పస్వాముల తోడ్పాటు
- అయ్యప్పస్వామి దేవాలయంలో 18 ఏళ్లుగా కొనసాగుతున్న భిక్ష
- భిక్షకు రోజూ వెయ్యి మందికిపైనే హాజరవుతున్న అయ్యప్ప మాలాధారులు
- దాతల తోడ్పాటుతో 41 రోజుల పాటు నిరంతరం అన్నదానం



ఆలయంలో భిక్ష చేస్తున్న అయ్యప్పలు

పెద్దదోర్నాల:

శ్రీశైల పుణ్యక్షేత్రానికి తరలి వచ్చే అయ్యప్ప మాలాధారులకు ఏటా 41 రోజుల పాటు అన్నదానం నిర్వహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకుంటున్నారు స్థానిక అయ్యప్ప సేవా సమితి సభ్యులు. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా వెలుగొందుతున్న శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ముఖ ద్వారంగా వెలుగొందుతున్న పెద్దదోర్నాలలో 2016లో అయ్యప్పస్వామి దేవాలయాన్ని నిర్మించారు. శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు మండల కేంద్రం నుంచి శ్రీశైల పుణ్యక్షేత్రానికి తరలి వెళ్తుంటారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి దేవాలయలంలో భిక్షను ఏర్పాటు చేసి దూర ప్రాంతాల నుంచి వచ్చే మాలాధారులకు స్థానిక అయ్యప్పలు సేవలు అందిస్తున్నారు.

ఇదీ..ఆలయ నేపథ్యం

అయ్యప్పస్వామి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మండలానికి చెందిన ప్రముఖులు బొగ్గరపు మణికంఠ శేఖర్, దివంగత బొగ్గరపు వెంకటేశ్వర్లు, బొగ్గరపు రమేష్‌లు ఆలయానికి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. వారందరి సహకారంతో ఆలయ పనులు నిరాటంకంగా కొనసాగాయి. చుట్టుపక్కల ఎక్కడా లేని విధంగా ఆలయం రూపుదిద్దుకొంది. అయప్పస్వామి ఆలయం ప్రారంభించినప్పటి నుంచి దాదాపు 18 ఏళ్లుగా ఆలయంలోనే అయ్యప్పస్వామి మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. శ్రీశైలం తరలి వచ్చే వేలాది మంది భక్తులు, అయ్యప్పలు శ్రీశైల పుణ్యక్షేత్రానికి వచ్చే యాత్రికులతో పాటు స్థానికంగా 100 మంది వరకు అయ్యప్ప మాలధారణ చేస్తుంటారు. అత్యంత నియమ నిష్టలతో మాలలు ధరించే భక్తులకు స్థానిక ఆలయంలోనే వంట మనుషులను ఏర్పాటు చేసి అయ్యప్పలకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. రోజూ నిర్వహించే భిక్ష కార్యక్రమానికి దాదాపు 30 వేల రూపాయలు ఖర్చు అవుతుందని ఆయ్యప్ప స్వాములు పేర్కొంటున్నారు.

డిసెంబర్ ఒకటో తేదీ నుంచి జనవరి 11వ తేదీ వరకు భిక్ష కార్యక్రమం కొనసాగుతుందని స్థలదాతల్లో ఒకరైన బొగ్గరపు శేఖర్ పేర్కొంటున్నారు. కార్యక్రమాలను స్థలదాతలతో పాటు గురు స్వాములు సాంబశివరావు, పందు స్వామి, కార్యవర్గ సభ్యులు రావిక్రింది రామారావు, గురిజేపల్లి శ్రీనివాసాచారి, బండారు సుబ్బనారాయణ, యక్కంటి నారాయణరెడ్డి, రావిక్రింది లక్ష్మీనరసింహరావు, తిరుమలరెడ్డి జగదీశ్వరరెడ్డి, నారాయణ స్వామి (టెంట్ హౌస్) తదితరుల తోడ్పాటుతో నిరాటంకంగా భిక్ష నిర్వహిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

ఎన్నో ఏళ్లుగా ఆలయంలోనే భిక్ష



ఆలయం ప్రారంభించిన నాటి నుంచి ఇక్కడే భిక్ష చేస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే అయ్యప్పలతో పాటు స్థానికంగా ఉండే అయ్యప్పలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భిక్షకు రోజుకు 30 వేల రూపాయల వరకు ఖర్చు ఉంటుంది.

– శ్రీనివాసాచారి, పెద్దదోర్నాల

41 రోజుల పాటు కొనసాగుతుంది



అన్నదాన కార్యక్రమం డిసెంబర్ 1వ తేదీ నుంచి జనవరి 11వ తేదీ వరకు కొనసాగుతుంది. శ్రీశైలం వెళ్లే అయ్యప్ప మాలాధారులతో పాటు ఇతర మాలాధారులు సైతం ఇక్కడ భిక్ష తీసుకునే అవకాశం ఉంది. దాతల ప్రోత్సహంతో భిక్ష కార్యక్రమం కొనసాగుతుంది.

– బొగ్గరపు శేఖర్, స్థల దాత, పెద్దదోర్నాల



ఉపయోగకరంగా ఉంది

చాలామంది అయ్యప్పలు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ నేపథ్యంలో వారు భిక్ష కోసం ఇబ్బందులు పడకుండా ఇక్కడే అందించటం ఎంతో ఉపయోగకరం.

– వేణుగోపాలరెడ్డి, అయ్యప్ప మాలధారుడు

అన్నదానం ప్రారంభించిన బూచేపల్లి వెంకాయమ్మ



అన్నదానం ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: స్థానిక శ్రీ హరిహరి సుత అయ్యప్ప స్వామి ఆలయంలో కొత్తపాలెం మహిళలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వయంగా దీక్షా స్వాములకు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు వడ్డించారు.

శబరికి బయల్దేరిన అయ్యప్పలు



శబరి బయల్దేరుతున్న అయ్యప్పలు

దొనకొండ: 41 రోజులు మాల ధరించి దీక్షతో శుక్రవారం అయ్యప్ప భక్తులు శబరికి బయల్దేరి వెళ్లారు. స్థానిక విజయాంజనేయ స్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులకు గురుస్వాములు బాల రంగయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. విజయాంజనేయ స్వామి భక్త బృందంచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి అయ్యప్పలకు అన్ని వసతులు సమకూర్చారు. సద్ది కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రెడ్ రిబ్బన్ క్లబ్ యాక్టివిటీస్



రెడ్ రిబ్బన్ క్లబ్ యాక్టివిటీస్‌లో విద్యార్థినులు

పెద్దదోర్నాల: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రెడ్ రిబ్బన్ క్లబ్ యాక్టివిటీస్ నిర్వహించారు. సీసీఈ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి మాట్లాడుతూ వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా ప్రతి కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ యాక్టివిటీస్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తదుపరి కళాశాలలో విద్యార్థులకు పెయింటింగ్ కాంపిటీషన్, రంగోళీ కాంపిటీషన్, పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్, డిబేట్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌బాబు, జయసింహ, రమేష్, అతిథి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు చెల్లించాలి

- ఎస్టీయూ డిమాండ్



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

త్రిపురాంతకం: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు యర్రయ్య డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఎస్టీయూ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. 12వ పీఆర్సీ వెంటనే నియమించాలన్నారు. ఉపాధ్యాయులతో ఇతర పనులు చేయించరాదన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉపాధ్యాయుల స్థానాల్లో వలంటీర్లను నియమించాలని కోరారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు రవిచంద్ర, పేతురు, ఖాసీం, ప్రసాద్, ఏడుకొండలు, గాలెయ్య, మహిళా కార్యదర్శి నయోమి, రోజా పాల్గొన్నారు.

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

దర్శి: రక్తదానం చేస్తే ప్రాణ దానం చేసినట్లేనని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ అన్నారు. స్థానిక ఆ కళాశాలలో విజయ్ బ్లడ్ బ్యాంక్ వెల్ఫేర్ అసోసియేషన్, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్‌లు సంయుక్తంగా రక్తదానం శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భం ఎస్‌వీ రమణ మాట్లాడుతూ ఈ రక్తాన్ని తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. రక్తదానం చేస్తే శరీరంలో కొత్త రక్తం ఏర్పడి ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు వీవీ విజయ్, రెడ్ రిబ్బన్ కో ఆర్డినేటర్ వి.సుజాత, వై.వరలక్ష్మి, టి. వెంకటేశ్వర్లు, డాక్టర్ జి.వేణు, కె.ప్రభుదాస్, కె.నరేష్, జి. హనుమంతరావు, కె.యోగి ప్రకాశం పాల్గొన్నారు.

180 మందికి బెడ్‌షీట్లు, కార్పెట్‌ల అందజేత



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న రాబియా బేగం

దర్శి: మండలంలోని లంకోజనపల్లి రోడ్డు ఎస్సీ బాల, బాలికల హాస్టల్స్‌లో 180 మంది విద్యార్థులకు సాంఘిక సంక్షేమాధికారి చేతుల మీదుగా బెడ్‌షీట్‌లు, కార్పెట్‌లు, నోటు పుస్తకాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రాబీయా బేగం మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్యాన్ని సాధించే వరకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు, వార్డెన్‌లు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ వీర్రాజు

దర్శి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని మలేరియా జోనల్ డిప్యూటీ డైరెక్టర్ జి.వీర్రాజు అన్నారు. పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కాలువలు, డ్రమ్ములు, నీటి నిల్వ ప్రాంతాల్లో దోమలు ప్రబలకుండా తగు ముందస్తు జాగ్రత్తలు వివరించారు. వీర్రాజు మాట్లాడుతూ ప్రతి ఇంటిని ఏఎన్ఎంలు, ఆశాలు సందర్శించి దోమ లార్వాలు తొలగించాలని సూచించారు. మురుగు కాల్వల్లో నిల్వ ఉన్న చోట డెంగీ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్ ద్వారా స్ప్రేలు చేయించాలని సూచించారు. జ్వరబాధితులు ఎవరైనా ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిల్లో వెంటనే రక్త పరీక్షలు చేయించాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నర్రావుల బసవారెడ్డి, సుభాషిణీ, జోనల్ మలేరియా అధికారి సుధాకర్, శ్రీనివాసరావు, శివపార్వతి, ఆశా వర్కర్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను అప్రమత్తంగా ఉంచండి



మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

దర్శి: విద్యార్థులకు నేరాలపై అప్రమత్తంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు అవగాహన కల్పించాలని డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశం హాలులో ప్రధానోపాధ్యాయులకు సైబర్ నేరాలు జరిగే విషయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాల గురించి వివరించారు. తాము పని చేస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. వాటిపై గ్రామస్తులు, స్నేహితులు వారి బంధువులతో పాటు తెలిసిన వ్యక్తులకు కూడా అవగాహ కల్పించి నేరాలు తగ్గ ముఖ్యం పట్టేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీఐ రామారావు, ఎస్సై మురళి, ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి పాల్గొన్నారు.

మాస శివరాత్రి సందర్భంగా కోటి దీపోత్సవం

- వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పెద్దదోర్నాల: మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పర్వదినం సందర్భంగా మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు భారీగా చేరుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి కోటి దీపోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు బెదరె రాంప్రసాద్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమాజ పురోగతిలో బ్రాహ్మణుల పాత్ర ఎనలేనిది



పూజారిని సన్మానిస్తున్న సుబ్బారావు

యర్రగొండపాలెం: సమాజ పురోగతిలో బ్రాహ్మణుల పాత్ర ఎనలేనిదని విద్యాకమిటీ మాజీ చైర్మన్ గోళ్ల వెంకట సుబ్బారావు అన్నారు. కార్తిక మాసం సందర్భంగా శుక్రవారం 30 మంది బ్రాహ్మణ పురోహితులకు శాలువాలు కప్పి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజహితం, లోక కల్యాణం కోసం బ్రాహ్మణ పూజారులు నిరంతరం పూజలు, యజ్ఞాలు, హోమాలు చేస్తుంటారని, అటువంటి వారిని ప్రతి సంవత్సరం కార్తిక మాసంలో సన్మానించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు అయ్యలరాజు యోగేశ్వరరావు, అర్చకులు పొట్లం మల్లికార్జున శర్మ, నానా సుబ్బయ్య, దిట్టకవి శ్రీనివాసాచార్యులు, పార్థసారథి, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రఘుశర్మ, మిట్టపాలెం శాస్త్రి, రవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

దొనకొండ: స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వాతావరణ కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలను కళాశాల అడ్మిన్ నానీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పోటీలకు కేజీబీవీ, వివేకానంద, జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలైన షేక్ సఫియా, డి.అబ్రహం, బి.నవీన్, సీహెచ్ సరళకు కళాశాల ప్రిన్సిపల్ రామయోగి బహుమతులు అందజేశారు. అనంతరం గౌతమీ విద్యా సంస్థల అధినేత కనుమర్ల గుండారెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి కేకు కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అధ్యాపకులు మహాలక్ష్మి, యశోద, మల్లికార్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన పంట రకాలు సాగు చేసుకోవాలి

- లాం ఫాం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రెడ్డి

దొనకొండ: రైతులు కాలానుగుణంగా నూతన వంగడాలను సాగు చేయాలని ప్రాంతీయ పరిశోధన లాం ఫాం గుంటూరు శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శాస్త్రవేత్తల బృందంతో కలిసి రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలందించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం కింద సరఫరా చేసిన కంది పంట విత్తనాలు 3 రకాల ఎరువులను 16 మంది రైతులకు పంపిణీ చేశారు. వారు సాగు చేసిన పంటలను పరిశీలించారు. వీటి ఫలితాల ఆధారంగా వచ్చే ఏడాది ఎక్కువ మంది రైతులకు మేలు రకమైన కంది విత్తనాలు పంపిణీ చేస్తామని మోహన్‌రెడ్డి తెలిపారు. బ్రీడింగ్ శాస్త్రవేత్త కేవీ శివారెడ్డి మాట్లాడుతూ రైతులకు కందిలో రకాలను కొత్త రకాల వంగడాలను, వాటి లక్షణాలు వివరించి నూతన వంగడాలను వాడి అధిక దిగుబడి పొందాలన్నారు. కీటక శాస్త్రవేత్త ఎస్.సాంబవివరావు మాట్లాడుతూ ప్రస్తుతం కంది మొగ్గ దశలో ఉందని, మచ్చల పురుగు, పచ్చ పురుగు కనిపిస్తోందని, వీటి నివారణకు సూచన, సలహాలందించారు. అనంతరం 16 మంది రైతులకు క్రిమి సంహారిక మందులు ఉచితంగా పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జి.రమేష్, ఏఈఓ యోగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



క్రిమి సంహారిక మందులు అందుకుంటున్న రైతులు

నేడు పింఛన్ల పంపిణీ



సరుకులు అందజేస్తున్న సాయిబాబా భక్తులు

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 1వ తేదీన ఆదివారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 30వ తేదీన పింఛన్ల పంపిణీ చేయనున్నామని, మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో 7,703 మందికి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది అశ్రద్ధ చేయకుండా మొదటి రోజే నూరుశాతం పంపిణీ అయ్యే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

వృద్ధాశ్రమానికి సాయి భక్తుల వితరణ

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం శ్రీ కరుణా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దొనకొండ షిరిడీ సాయిబాబా భక్త బృందం శుక్రవారం వితరణ చేసింది. కార్తీకమాసం ముగింపు సందర్భంగా సుమారు రూ.15 వేల విలువైన బియ్యం, కిరాణా సరుకులు అందజేశారు. వారికి ఆశ్రమ డైరెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.